క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మృత్యుంజయ స్వామికి పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని తొలుత స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చ కర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహా మంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నేడు జగనన్న సురక్ష శిబిరం

నారాయణవనం: మండలంలోని పాలమంగళం సౌత్ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



పల్లమాల గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ సచివాలయా సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ నరసింహారావు ఆదేశించారు. సోమవారం ఆయన పల్లమాల, కాటూరు గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్పందనలో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని, సర్వేను పక్కా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయ ధ్వజస్తంభం వద్ద కుటుంబ సభ్యులతో గురుప్రసాద్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సోమవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పి.గురుప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మౌలిక వసతులపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

శ్రీకాళహస్తి: స్థానిక భాస్కరపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై బీజేపీ నాయకులు ఆరా తీశారు. కేంద్రంలో వసతులు, సేవలు అన్నీ బాగున్నాయని పిల్లలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు జి.రమేష్‌బాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో సమష్టి ఆహార పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నా వెంకటేశ్వర్లు, కుందేటి గోపాల్, ఎల్.గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు రోజారమణి, ప్రమీల, ఆయా జ్యోతి పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో బాలనాగమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే



బాలనాగాలమ్మ, చదవాలమ్మ ఊరేగింపు

సత్యవేడు: గురుపౌర్ణమి పురస్కరించుకుని బాలనాగమ్మ అమ్మవారి 17వ వార్షికోత్సవం సత్యవేడులో బాల నాగాలమ్మ భక్త బృందం ఘనంగా నిర్వహించింది. సోమవారం బాలనాగలామ్మ, గ్రామ దేవత చదవాలమ్మ(గంగమ్మ)లను విశేష పూల అలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ మాతంగీశ్వరాలయం నుంచి పాలబిందెలతో అమ్మ వార్ల ఊరేగింపు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధి, దేవాంగ వీధి, గంగమిట్ట వీధి, తానప్పమొదలి వీధులలో సాగింది. మొక్కుబడి ఉన్నవారు, వివాహం కానివారు, సంతానలేమితో బాధపడుతున్న వారు, నిరుద్యోగ యువతులు పసుపు వస్త్రములతో కంకణాలు ధరించి, పాలబిందెలు తలపై పెట్టుకుని, ఊరేగింపు వెంట సాగారు. పల్లాపు వీధి వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బాల నాగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ బృందం ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పూల మాలలు వేసి సన్మానించింది. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సీఐ ఎన్.శివకుమార్‌రెడ్డి, నాయకులు బొప్పన సోమశేఖర్, శేఖర్ బాబు, దాము, ఆరూరు శేఖర్, టెంకాయల కృష్ణయ్య, రాబర్ట్, జేఏసీ చైర్మన్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మాకూ సంక్షేమ పథకాలు వర్తింపజేయరూ!

- అంగన్‌వాడీ కార్యకర్తల వినతి



సత్యవేడు సీడీపీఓకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా వర్తింపచేయడానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ప్రాజెక్టు కార్యదర్శి కే.నిర్మల కోరారు. సోమవారం సత్యవేడు సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ దేవకుమారికి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాళ్లు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ.కాంతమ్మ, డి.శాంతి, జీ.ఝాన్సీ, వి.భారతి, సువర్ణదేవి, ఎం. భువన, ఏ.చందామర్రై, ఎం.గౌరి, కే.స్వర్ణలత, కే.శశికళ, జే.అనూరాధ, అనీల తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1గా ప్రభాకర్‌రాజు

నారాయణవనం: మండల విద్యాశాఖాధికారి-1గా ప్రభాకర్‌రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం భారతి ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరించారు. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న ప్రభాకర్‌రాజు ఉద్యోగోన్నతిపై ఎంఈఓ-1గా ఇక్కడికి వచ్చారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి తనవంతు కృషి చేస్తాని ఆయన చెప్పారు.

మా మంచి మాస్టారు



స్టడీ మెటీరియల్, యూనిఫాం అందుకున్న విద్యార్థులతో సుబ్రమణ్యం, టీచర్లు

- స్టడీ మెటీరియల్, యూనిఫాం వితరణ

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు స్టడీ మెటీరియల్, యూనిఫాం పంపిణీ చేశారు. స్కూలులో పనిచేస్తున్న ఇంగ్లిష్ టీచర్ సుబ్రమణ్యం తమ స్వంత ఖర్చుతో 30 మంది 10వ తరగతి విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్రభుత్వం విద్యాకానుక కింద ఇస్తున్న యూనిఫామ్‌కు అదనంగా తానూ విద్యార్థులకు ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. తాను ఎక్కడ పనిచేసినా ఆ స్కూలు విద్యార్థులకు ప్రతి ఏటా తన వంతు వితరణ చేస్తుంటానని సుబ్రమణ్యం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్వజావరోహణం



పూజలు చేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధాలయమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ధ్వజస్తంభానికి కట్టిన చీరలను కిందకు దింపారు. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవ మూర్తులు పురవీధుల్లో మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగారు. ఆలయ అధికారులు మల్లికార్జున్‌ప్రసాద్, లోకేష్‌బాబు, శ్రీహరి, కోదండపాణి, పురోహితులు అర్ధగిరి, ధర్మరాజస్వామి ఆలయ అర్చకులు పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

దాడిచేసి ఫెన్సింగ్, ఇల్లు ధ్వంసం

- నలుగురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని గోవిందవరంలో ఒకరిపై దాడిచేసి గాయపరచిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం తెలిపారు. సీఐ కథనం.. గ్రామానికి చెందిన బొల్లిని సర్వేశ్వరనాయుడు భూమిలోకి భూ తగాదా నేపథ్యంలో జేసీబీతో గ్రామస్తులు బొల్లిని కృష్ణమనాయుడు, లక్కలపూడి కృష్ణమనాయుడు, లక్కలపూడి విజయలక్ష్మి, గోపాల్‌నాయుడు చొరబడి ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. అలాగే ఇంటిని కూల్చివేశారు. అడ్డుకున్న సర్వేశ్వరనాయుడుపై దాడిచేసి గాయపరచారు. బాధితుడి తల్లి బొల్లిని నాగమ్మ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు బీసీ కాలనీలో మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు చేశారు. ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం తెలిపిన వివరాలు.. ముసలిపేడు బీసీ కాలనీకి చెందిన సయ్యద్ రఫీ తన ద్విచక్రవాహనాన్ని గ్రామానికి చెందిన తన బావమరది ఖాదర్‌బాషా ఇంటి వద్ద గత నెల 26 రాత్రి ఉంచాడు. 27 ఉదయం చూస్తే ద్విచక్ర వాహనం కనబడలేదు. దీనిని ఎవరో చోరీ చేశారని గ్రహించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు, కొత్తవీరాపురం, వికృతమాల గ్రామాల వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి చెప్పారు. ముందస్తు సమాచారం మేరకు శ్రీకాళహస్తి ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ హేమంత్‌కుమార్ తన సిబ్బందితో దాడులు చేశారు. స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వెలుగు జ్ఞానజ్యోతిని ఇచ్చేది గురువులే



యోగా గురువును సన్మానిస్తున్న అభ్యాసకులు



శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న అధ్యాపకుడు

శ్రీకాళహస్తి: అజ్ఞాన అంధకారాన్ని తొలగించి వెలుగు జ్ఞానజ్యోతిని ఇచ్చేది గురువులేనని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్ అన్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. వ్యాసమహర్షి గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గీత, దీనదయాల్, మాలతి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం ఆవరణలోని యోగా కేంద్రంలో కూడా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. యోగా గురువు మార్కండేయులను అభ్యాసకులు సన్మానించారు. మార్కండేయులు కొన్నేళ్లుగా చాలా మందికి యోగా నేర్పిస్తున్నారని, ఆయన ఎందరో శిష్యులను తయారు చేశారన్నారు. అందుకే ఆయన్ను గురుస్థానంలో సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, భాస్కర్, సూర్యప్రసాద్, నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు





ఏర్పేడు : విశేషాలంకరణలో సాయిబాబా, నాగలాపురంలో..

సత్యవేడు: శ్రీకాళహస్తి- సత్యవేడు మార్గంలోని సాయి బాబా ఆలయం, సత్యవేడు-ఊత్తుకోట రోడ్డులోని సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం కాగడ హారతితో స్వామివారిని మేల్కొలిపారు. గణపతి పూజానంతరం అధిక సంఖ్యలో భక్తులు సాయి నాథుని చలువ రాతి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ధ్యాన మందిరంలో సాయి నాథుని పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ఉయ్యాల సేవ వేడుకగా నిర్వహించారు. భక్త జన కోలాహలం, మంగళ వాయిద్యాల హోరు, పండరి భజన ఘోష, రాత్రి బాణసంచా వేడుకల మధ్య సాయినాధుల ఉత్సవ సేవ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం రెండు ఆలయాలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సాయి బాబా ఆలయంలో సోమవారం ఉదయం స్వామివారి విగ్రహానికి అభిషేక, పూజలు చేశారు. భక్తులు కీర్తనలు ఆలపించారు. భజన చేశారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిప్రపత్తులతో 'గురుపౌర్ణమి'

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని షిర్డి సాయినాధుని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. నాగలాపురంలోని బాబా ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సాయంత్రం స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని కీళపూడి సాయినాధుని ఆలయంలో భక్తులు షిర్డినాధునికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఉదయం బాబాకు పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజనలతో బాబా మందిరాలు హోరెత్తాయి.



సారె తీసుకెళుతున్న పాలకమండలి సభ్యులు

ముక్కంటి సారె సమర్పణ

శ్రీకాళహస్తి: విజయవాడ దుర్గమల్లీశ్వరస్వామి ఆలయానికి సోమవారం ముక్కంటి సారె అందజేశారు. ఇంద్రకీలాద్రిలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఆధ్వర్యంలో సారె సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ జేఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు రమాప్రభ, కొండూరు సునీత, సుబ్బారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

నిత్యోత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లకు వైభవంగా నిత్యోత్సవం నిర్వహించారు. తొలుత జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



పూజల్లో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని దొడ్డమిట్టలో పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, పెంచులయ్య, కట్టయ్య, రమేష్, గురవయ్య, చంద్రశేఖర్, జగదీష్, గురునాథ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు





మాట్లాడుతున్న మురగయ్య, తొట్టంబేడు: మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ భక్తవత్సలం

ఏర్పేడు: జగనన్న సురక్షతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని ఈఓపీఆర్డీ మురగయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయంలో సర్పంచ్ మోహనప్రియ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అర్హత ఉండి పథకాలు పొందని లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడానికి అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు, సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. నెల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గౌరి, రామయ్య ఆచారి, పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలో జగనన్న సురక్షపై జేసీఎస్ మండల ఇన్‌చార్జి భక్తవత్సలం, ఎంఎల్ఓ సురాజ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పాయ్య, సూరావారిపల్లె, పెద్దకన్నలిలో జగనన్న సురక్ష విధి విధానాల గురించి వలంటీర్లకు అవగాహన కల్పించారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి అవి అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పి.మోహన్, కె.రమేష్, నాగరాజు, మణి, సచివాలయ గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.